**1984 రక్తాక్షి ఉగాది సస్పెన్స్ కథలపోటీలో రెండవబహుమతి పొందిన కథ**

**"రేవతి భోంచేసిందా... ఏదీ కనబడదేం?" అన్నాడు భోజనానికి కూర్చున్న గోవిందయ్య కూతురు గురించి భార్యను అడుగుతూ.**

# తొందరపడి ఒక కోయిల....

**పి. చలమాజీరావు**

"ఇప్పుడే భోజనం చేసి పక్కవీధిలో దాని స్నేహితురాలు మాలతి ఇంటికి వెళ్ళింది. ఏదో నవల తెచ్చుకోవాలిట" అంది భార్య లక్ష్మీ నరసమ్మ విసనకర్రతో గోవిందయ్యకు విసురుతూ.

ఇంతలో ఉరుము శబ్దం వినబడింది.

"ఏమిటి వర్షంగాని వస్తుందా కొంపదీసి... వెళ్ళి చూడు లక్ష్మీ" అన్నాడు గోవిందయ్య.

లక్ష్మీ నరసమ్మ బయటకు వెళ్ళి చూసి వచ్చింది.

"మేఘాలు తూర్పు దిశ నుంచి కమ్ముకొస్తున్నాయి. వర్షం వస్తుందేమో నండీ" అంది.

"ఈ నెల్లో వర్షాలేమిటి లక్ష్మీ.... బస్తాలకెత్తిన ధాన్యం కల్లంలోనే వుండిపోయాయి. ఆ తాగుబోతు పోతురాజు పాకలోకి మోస్తాడో, లేదో... వర్షం వస్తే ఇరవై బస్తాలు నీటిపాలయిపోతాయి. నే వెళ్ళాలి" అంటూ తింటున్నవాడు లేచిపోయాడు.

"అయ్యో మధ్యలో లేచిపోకండి.... తొందరగా తినేసి వెళ్ళకూడదూ" అంది లక్ష్మీనరసమ్మ బాధగా.

"భోజనానికేంలే! అటునుంచి వచ్చాక తింటాను. ముందు ధాన్యం పాడవకుండా చూడాలి" అంటూ చెయ్యి కడుక్కొని, కర్రగొడుగు, టార్చ్‌లైట్ పట్టుకున్నాడు. టైము చూసుకొంటే రాత్రి ఎనిమిది దాటుతోంది. జోళ్ళు వేసుకొని బయలుదేరాడు.

కల్లం దగ్గరకు వెళ్ళేసరికి పోతురాజు ధాన్యం బస్తాలను పాకలోకి మోస్తున్నాడు.

"ఏరా పోతిగా.... నువ్వున్నావో, లేకపోతే కల్లుతాగి ఎక్కడైనా పడుకున్నావో అని వచ్చాను" అన్నాడు గోవిందయ్య.

"అదేంటిబాబూ! అంత ఉరుము ఉరుముతుంటే ఎట్టా పడుకుంటాను. మీరెళ్లండి బాబూ నేను బస్తాలు మోసేస్తాను" అన్నాడు పోతురాజు.

గోవిందయ్య ఆకాశం వైపు చూశాడు. తూర్పు దిశ నుంచి మెరుపులు అప్పుడప్పుడూ మెరుస్తున్నాయి. మధ్య లో ఉరుముతోంది ఆకాశం.

"తమరు ఇంకా స్తబ్దంగా వుంటే వర్షం వస్తాది. బస్తాల సంగతి నేజ్జూసుకుంటాను. తమరెళ్ళండి బాబూ" అన్నాడు భరోసా యిస్తూ. అప్పటికే చాలా బస్తాలు లోపలికి మోసేశాడు. ఇక నాలుగైదు కంటే ఎక్కువ లేవు.

"సరే అయితే- నే వెళ్తున్నాను" అంటూ గోవిందయ్య యింటి ముఖం పట్టాడు. చుట్టూ కీచురాళ్ళు రొద పెడుతున్నాయి. దూరంగా ఊళ్లో నుంచి కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి.

పొలాల గట్ల మీద నుంచి కంకర రోడ్డు మీద కొచ్చాడు. లఘు శంక తీర్చుకోవడానికి మదుం పక్కకి నెమ్మదిగా దిగాడు.

మదుం పక్కనే వున్న మర్రి చెట్టు వెనక నుంచి ఎవరో ఆడ మగ మాట్లాడుకుంటున్న మాటలు వినిపించాయి.

పల్లెటూళ్ళలో ఊరిబయటకు వచ్చి రహస్యంగా కలుసుకోవడం మామూలే 'మనకెందుకులే' అని గోవిందయ్య వెళ్ళబోతూ హఠాత్తుగా ఆగిపోయాడు.

వినిపిస్తున్నది తన కూతురు కంఠం.... అయితే... అయితే వాడెవడు! గోవిందయ్య చప్పుడు చెయ్యకుండా ఆ చీకట్లో మదుం గట్టుని ఆనుకొంటూ చెట్టుకి దగ్గరగా వెళ్ళాడు. ఇప్పుడు మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"నాకు భయంగా వుంది సూర్యం. ఇటువంటిపని మావంశంలో ఎవరూ చెయ్యలేదు" అంటోంది రేవతి.

"ఇలా భయపడుతూ కూర్చుంటే మీ నాన్న నిన్నెవరికో కట్టబెట్టేస్తాడు. నువ్వు లేందే నేను బ్రతకలేను రేవతీ! రేపే వెళ్ళి

పోదాం రాజమండ్రి" అన్నాడు సూర్యం.

సూర్యం ఆవూళ్లో మోతుబరి పెద నాయుడుగారి రెండో అబ్బాయి.

"పోనీ మీనాన్నని నువ్వు స్వయంగా అడిగితే ఒప్పుకుంటాడేమో.. ఒక్కసారి అడగకూడదూ?" అంది.

"అది జరగనిపని. పొలాల తగువుల్లో మీనాన్నకీ మా నాన్నకీ చుక్కెదురు. మ నాన్న ఎలాగూ అడగడు. నే నడిగితే మీ నాన్న ఒప్పుకోడు. ఇంతకీ రేపు నాతో రావడానికి సిద్ధమేనా" అన్నాడు అసహనంగా.

"రేపేనా!" అంది రేవతి.

"రేపు తప్పితే మళ్ళీ కుదరదు. అందుకే నిన్నిక్కడకు పిలిచాను. రేపు ఊళ్లో హరికథ వుందికదా, నువ్వెలాగో తప్పించుకొని హరికథనుంచి ఇక్కడకు వచ్చెయ్. సరిగ్గా రాత్రి పదిగంటలకు రావాలి. స్టేషన్‌కి పావు గంటలో నడిచెళ్ళిపోవచ్చు.... అర్థమైందా?" అన్నాడు.

"వచ్చేటప్పుడు ఏం తెచ్చుకోవాలి?" అంది రేవతి.

"నాలుగు జతలు నీ బట్టలు ఓ సంచిలో వేసుకురా. బంగారు వస్తువులన్నీ ఇంట్లోనే వదిలేసి రా....నా దగ్గర కావలసినంత డబ్బుంది. రాజమండ్రిలో రిజిస్టర్ మేరేజ్ చేసుకొందాం. తరువాత ఏ చిన్న ఉద్యోగమైనా దొరక్కపోదు. నిన్ను వదులుకోలేకే నేను ఈ సాహసం చేస్తున్నాను రేవతీ. ఇప్పుడు నేను ధైర్యం చెయ్యకపోతే మన తండ్రుల పగలవల్ల జీవితాంతం మనం బాధపడాల్సివస్తుంది." అన్నాడు.

"ఎంత మంచివాడవు సూర్యం.... కాని నేనిలా తెగిస్తే నాన్న తన పరువు పోయిందని ఎంత బాధపడతాడో" అంది.

"నిజంగా మీ నాన్నకు నీ మీద ప్రేమ వుంటే మొదట బాధపడినా తరవాత మన పెళ్ళికి ఒప్పుకొంటాడు రేవతీ! లేదా నీ సుఖం కంటే తన పరువే ముఖ్యం అనుకొంటే అతన్ని గురించి నువ్వెందుకు బాధపడడం. సరే రేపు పది గంటలకు తప్పకుండా వచ్చెయ్యాలి. పాసింజరు 11 గంటలకు బయలుదేరుతుంది" అన్నాడు.

కొంతసేపు మౌనం తరవాత నెమ్మదిగా ఇద్దరూ బయలుదేరి రోడ్డెక్కి వెళ్ళిపోయారు. గోవిందయ్య మదుం గోడవైపు ముఖం తిప్పి కొద్దిసేపు వుండిపోయాడు. చినుకులు ప్రారంభం అయ్యాయి. గొడుగు విప్పి నెమ్మదిగా తనూ రోడ్డుమీదకు వచ్చి ఊరువైపు నడిచాడు.

* * *

"బస్తాలు తడిసిపోయాయా" అంది లక్ష్మీనరసమ్మ ఎదురువచ్చి కర్ర. గొడుగు

## ప్రతితరువూ వినిపించెను రాగం!

ప్రతి పూవొక వికసించిన హాసం
ప్రతి తరువూ వినిపించెను రాగం!
వసంతమాసం వచ్చిదంటె
వనమే ఒక సుందర గానం
వసంతమాసం వచ్చిందంటె
మనసంతా సంతసధ్వానం! ॥ప్రతి॥

మావి చిగురున కోకిలపాట
వేసెను మదిలో ఆనందం బాట
గాలిలో తేలె మల్లెల గంధం
మమతలు కూర్చె మధుర మరందం! ॥ప్రతి॥

చల్లటి తెమ్మెర అలలుగ వీచెను
పుష్పసువర్ణములు మోదము కూర్చెను
శుకపికకూజితముల జగతి నిండెను
ప్రతిమదిలో నవచైతన్యం కదిలెను! ॥ప్రతి॥

—శశికాంత్ శాతకర్ణి

అందుకొని.

"లేదు లక్ష్మి పోతిగాడు బస్తాలు మోసేశాడు. వర్షం ఇప్పుడే కదా మొదలయింది" అన్నాడు.

రేవతి తడిసిన బట్టలు మార్చుకొని వరండాలోకి వచ్చింది.

"మాలతి ఇంటినుంచి నువ్వా ఇప్పుడే వచ్చావా రేవతీ" అన్నాడు గోవిందయ్య.

"అవున్నాన్నా.... కబుర్లలో వర్షం రావడం గమనించలేదు. తడిసే వచ్చాను" అంది.

"కాలం కాని కాలంలో వర్షాలు! ఈ కోస్తాకు తుఫానుల బెడద ఎలా వదులుతుందో తెలీదు" అంటూ గోవిందయ్య మళ్ళీ భోజనం దగ్గర కూర్చున్నాడు. వంటింటి పక్కన వేసిన నులకమంచం మీద కూర్చొని రేవతి తల తుడుచుకొంటోంది.

"రేపిలాగ వుంటే హరికథ జరిగినట్టే లక్ష్మి. పాపం! హరిదాసు ఎంత ఆశతో వచ్చాడో ఈ వూరు." అన్నాడు అన్నం కలుపుకొంటూ గోవిందయ్య.

"రేపు కాపోతే ఎల్లుండి చెప్తారు. అయినా సంతబయలు తడిసిపోతే కూర్చోవడానికి ఇబ్బంది. ఇది తుఫాను కాకపోతే అదృష్టమే!" అంది లక్ష్మీనరసమ్మ.

రేవతి తల తుడుచుకొని జడ వేసుకొంది. గోవిందయ్య భోజనం ముగించి లేచి వచ్చాడు. వచ్చి వరండాలో వాలు కుర్చీలో కూర్చున్నాడు.

వర్షం పెద్దదై చూరునుంచి ధారలుగా పడుతోంది. "అమ్మా రేవతీ....వక్కపొడి డబ్బా తీసుకురామ్మా...." అన్నాడు.

గదిలోనుంచి డబ్బాతెచ్చి తండ్రిముందు వుంచింది. లక్ష్మీనరసమ్మ వంటిల్లు సర్ది తలుపేసి వరండాలోకి వచ్చింది.

"లక్ష్మీ....ఇవాళ కాముడు బెజవాడనుంచి ఉత్తరం రాసిందే. గోపీకి సంబంధాలు చూస్తున్నారట" అన్నాడు చుట్ట చుట్టుకొంటూ.

"అదేమిటండీ....రేవతి వుండగా గోపీకి వేరే సంబంధాలా....రేవతిని చేసుకొంటానని మీ చెల్లెలు అప్పుడన్నమాట మరిచిపోయిందా" అంది నిష్ఠూరంగా.

"అదెందుకు మరిచిపోతుందే....మనమే వెళ్ళి అడగాలని అలా రాసింది. ఎంత చెల్లెలయినా ఇప్పుడది మగపెళ్ళివారు కదా. ఇంతకీ ననెప్పుడెళ్ళమంటావా?" అన్నాడు గోవిందయ్య.

"వెళ్ళక ఇంకా ఇక్కడే కూర్చుంటారా. అయినా వెంటనే వస్తున్నానని ఉత్తరం రాసి పడెయ్యక ఈ మాటలెందుకండీ" అంది.

"ఏమ్మా రేవతీ... గోపీని చేసుకుంటావా?" అన్నాడు గోవిందయ్య. రేవతి మాట్లాడలేదు.

"చెప్పమ్మా.... వాడు చేసేది చిన్న ఉద్యోగమే అనుకో...అయినా అత్త, ఆడు నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు. బెజవాడలాంటి పెద్ద పట్నంలో ఆ



జీతం చాలదనుకో. మనం ఇచ్చే కట్నం బాంకులో వేసుకుంటే ఆ వడ్డీ వస్తాది. అది చాలదా?" అన్నాడు.

"వద్దు నాన్నా.... నా పెళ్ళికిప్పుడేం తొందర" అంది గోవిందయ్య నవ్వాడు.

"నీ ఇష్టం. నేను చెప్పవలసింది చెప్పాను. నీకిష్టంలేకపోతే ఉత్తరం రాయనులే" అన్నాడు చుట్ట వెలిగించుకొని.

"బాగుంది అబ్బా కూతురూ ఇష్టాలు.



దాన్నడగడం ఏమిటండీ" అంది లక్ష్మినరసమ్మ కోపంగా.

"మనసు లేని మనువు చేసుకొని అదేం సుఖపడుద్దిలే" అన్నాడు చుట్ట పొగ పీలుస్తూ.

"మనువైతే మనసు అదే పుడతాది. దాని మాట పట్టుకొని బంగారంలాంటి సంబంధం వదులుకోకండి" అంది లక్ష్మినరసమ్మ.

"నువ్వెన్ని చెప్పినా నేను అమ్మాయి పక్షమే. ఏం తల్లీ" అన్నాడు రేవతి వైపు చూసి నవ్వుతూ.

రేవతి మనస్సు దోలాయమాన స్థితిలో ఊగిసలాడుతోంది. అటు సూర్యం ప్రేమ వదులుకోలేకపోతోంది. ఇటు తండ్రి తన మీద వుంచిన నమ్మకానికి కంట నీరు వస్తోంది.

గోవిందయ్య చుట్ట అవతల పారేసి పడక గదిలోకి వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

మరునాడు రాత్రి వాతావరణం ప్రశాంతంగానే వుంది. "వర్షం వచ్చే జాడలు లేవు. హరికథ జరుగుతోంది. మనం వెళ్దామా లక్ష్మి" అన్నాడు గోవిందయ్య ఆ రాత్రి భోజనం దగ్గర.

"హరికథ విని ఎన్నాళ్ళయిందో-వెళ్దామండీ" అందావిడ.

"ఏమ్మా రేవతీ.... నువ్వూ వస్తావా. ఇంట్లో వుండిపోతావా" అన్నాడు గోవిందయ్య.

హరికథకు వెళ్ళి అక్కడ నుంచి నలుగురి కళ్ళనుంచీ తప్పించుకొని రావడం కంటె ఇంట్లో నుంచి వెళ్ళిపోవడం మరింత సులభం అనిపించింది రేవతికి.

"నాకు హరికథలు ఇష్టం వుండవు నాన్నా.... మూడుగంటలేగా ఒంటరిగా వుండాలి. నాకేం భయం లేదు. గెడపెట్టుకొని పడుకుంటాను. మీరు వెళ్ళండి" అంది రేవతి


భోజనాల తరువాత కొద్దిసేపు మాట్లాడుకున్నారు. తరువాత గోవిందయ్య భార్యతో హరికథకు బయలుదేరాడు.

"జాగ్రత్త తల్లీ... లోపల గడియ వేసుకోవడం మర్చిపోక" అని మరీ మరీ జాగ్రత్తలు చెప్పింది లక్ష్మినరసమ్మ.

తల్లిదండ్రులు వెళ్ళగానే రేవతి గదిలోకి వెళ్ళి నాలుగు జతల బట్టలు సంచిలో సర్దుకొంది. గొలుసు, బంగారు గాజులు తీసి బీరువాలో దాచేసింది.

గోడ గడియారం టైము తొమ్మిదిన్నర చూపిస్తోంది. పదిగంటలకు రమ్మనాడు సూర్యం. మరో పావుగంట పోయాక బయలుదేరాలి.

భయం, కంగారు రేవతిని నిలువనివ్వడం లేదు. తన తండ్రి సూర్యంతో పెళ్ళికి ఒప్పు



కొంటాడన్న నమ్మకం లేదు. ఒప్పుకున్నా సూర్యంతండ్రి ససేమిరా ఒప్పుకోడు. అందుకే సాహసంతో వెళ్ళడానికే నిర్ణయం తీసుకుంది.

పావు తక్కువ పది అయింది. రేవతి తలుపు తీసుకొని వీధిలోకి వచ్చి ఒకసారి తొంగి చూసింది. అందరూ హరికథకు వెళ్ళడం వల్ల వీధంతా నిర్మానుష్యంగా వుంది. లోపలికి వెళ్ళి సంచి, టార్చ్‌లైట్ తీసుకొని బయటకు వచ్చి గడియవేసి తాళం కప్పను నొక్కి తాళాన్ని కిటికీవక్కనున్న నెరియలో వుంచింది. బయటకు అంతా వెళ్ళినప్పుడు అలా గూట్లో వుంచడం మామూలే.

తల మీద చీరకొంగు కప్పుకొని వీధి దాటే వరకు తొందరగా అడుగులు వేసింది. రోడ్డు మీదకు వచ్చాక స్వేచ్ఛగా ఊపిరి తీసుకొంది. తొందరగా అడుగులు వేసి పది నిముషాల్లో మదుం గట్టు ప్రక్కకి చేరుకొంది.

"హమ్మయ్య....వచ్చావా....ఏం అవాంతరం వస్తుందోఅని భయపడ్డాను....త్వరగా పద....అంటూ సూర్యం రేవతి చేతిలోని సంచి తీసుకొని టార్చ్‌లైట్ వెలుతురులో అడ్డదారిన స్టేషన్‌వైపు బయలుదేరాడు.

"భయంగావుంది. సూర్యం" అంది రేవతి. "కొద్ది రోజులు అలాగే వుంటుంది. మరేం కంగారుపడక. పెళ్ళయ్యాక అన్నీ సర్దుకుంటాయి" అన్నాడు.

రాత్రిపూట అడ్డదారిలో రేవతి సరిగ్గా నడవలేకపోవడంవల్లి స్టేషన్ చేరేసరికి పదిన్నర అయింది.

ఇంకా ట్రైన్ రావడానికి ఇరవై నిముషాలు టైముంది. "నువ్వు ప్లాట్‌ఫారమ్ చివర-అదిగో ఆ చీకటిగా ఉన్న చోట బెంచీ మీద కూర్చో....నేను టికెట్స్ తీసుకొని వస్తాను" అన్నాడు సూర్యం.

రేవతి తలనిండా ముసుగు కప్పుకొని ఆ చీకట్లో బెంచీ మీద కూర్చొంది. విపరీతంగా చలిగాలి వీస్తుంటే వణుకు పుడుతోంది. పది నిమిషాల్లో సూర్యం టికెట్స్ తీసుకొనివచ్చాడు.

ప్లాట్‌ఫారం మీద కొంతమంది అటూ, ఇటూ తిరుగుతున్నారు గాని ఎవరూ వీరిని గమనించడం లేదు. సూర్యం రేవతి పక్కన కూర్చొని ఏవో చెప్తున్నా రేవతికి వినబడడం లేదు. తండ్రి ముఖమే కళ్ళ ముందు మెదులుతోంది.

ట్రైన్ కూత విని రేవతి ఉలిక్కిపడింది. "పాసింజర్ వచ్చేస్తోంది. పది నిముషాలు ఆగుతుందిలే కంగారుపడక. చివరి కంపార్ట్‌మెంట్‌లో ఎక్కుదాం" అన్నాడు సూర్యం లేస్తూ. రేవతీ లేచింది.

పెద్ద కూతతో పాసింజర్ వచ్చి ఆగింది. కొంత మంది దిగారు. రెండు నిముషాలు పోయాక

"రా త్వరగా రేవతీ. అదిగో ఆ కంపార్ట్‌మెంట్ చివరిది ఖాళీగా వుంది. పద" అంటూ రేవతి చెయ్యి పట్టుకొని తీసుకెళ్ళాడు.

రేవతి చీరచెంగు భుజాలచుట్టూ కప్పుకొని సూర్యంవెంట బయలుదేరింది. కంపార్ట్‌మెంట్ ఖాళీగా వుండడంవల్ల సీట్లు తొందరగానే దొరికాయి.

ఐదు నిముషాలు గడిచాక ట్రైన్ బయలుదేరింది.

రేవతి తేలిగ్గా ఊపిరి తీసుకొంది. కిటికీ వక్క కూర్చోవడంవల్ల చలిగాలి ముఖానికి తగులుతోంది. సూర్యం లేచి షట్టర్ మూసేశాడు.

"ఇంకేం భయం లేదులే రేవతీ.... ఎవరైనా చూస్తారనే కంగారు అక్కర్లేదు" అన్నాడు భుజంమీద చేయి వేసి.

రేవతికి ఆనందం, దుఃఖం కలగలుపుగా వచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి.

ట్రైన్ స్పీడ్ అందుకుంది.

పావుగంట గడిచేసరికి ఏదో స్టేషన్ వచ్చింది.

"చలిగా వుంది. టీ తాగుతావా రేవతీ. ఇంకా రాజమండ్రి చాలా దూరం వుంది" అన్నాడు.

"వద్దు. అలవాటు లేదు. నువ్వు తీసుకో" అంది. సూర్యం లేచి వెళ్ళబోతూ ఎదురుగా వచ్చిన వ్యక్తిని చూసి విద్యుద్ఘాతం తిన్న

వ్యక్తిగా నిలబడిపోయాడు.

ఎదురుగా గోవిందయ్య!!

"మీ....మీ....మీరా" అన్నాడు గొంతు పెగల్చుకొని. రేవతి తలఎత్తి చూసింది. తండ్రిని చూసి తుపాకిగుండు తగిలిన వ్యక్తిలా విలవిలలాడిపోయింది.

"కూర్చో సూర్యం... మరేం భయపడక... విన్నేం చెయ్యను" అంటూ సూర్యాన్ని కూర్చోబెట్టి తను పక్కన కూర్చున్నాడు. రేవతి వంచిన తల ఎత్త లేదు.

"నిన్నరాత్రి మీరిద్దరూ మదుంపక్కన మాట్లాడుకొన్న మాటలన్నీ పొలంనుంచి వస్తూ అనుకోకుండా విన్నాను సూర్యం. మీ నాన్నకు, నాకు భయపడి పట్నంలో రిజిస్టర్ పెళ్ళి చేసుకొందామని అనుకొన్నారు. రేవతి నా కొక్కగా నొక్క కూతురు. దాని సుఖంకంటె నా పట్టుదల ముఖ్యం కాదు. అందుకే మీ వెనక వచ్చి మరో కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాను. భయపడకండి. పట్నంలో నేనే దగ్గరుండి మీ పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో చేయిస్తాను. తరవాత మన వూరెళ్ళిపోయి పెద్ద ఎత్తున నేనే నీకు కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తాను. పెదనాయుడు అడ్డువచ్చినా నేను జడవను. తరవాత మీ నాన్న ఒప్పుకొంటే రేవతిని మీ ఇంటికి తీసుకెళ్ళిపోవచ్చును. లేకపోతే నాతోపాటు నా వ్యవసాయం చూసుకొంటూ నా దగ్గర వుండిపోదువు గాని. పొలాలన్నీ అమ్మాయి పేర. నీ పేర రాసేస్తాను. ఇల్లరికం నీకు ఇష్టంలేకపోతే పట్నంలో ఏదైనా ఉద్యోగం చూసుకొందువు గాని. ఏమంటావు సూర్యం?" అన్నాడు గోవిందయ్య సూర్యం భుజం మీద చెయ్యి వేసి.

"చాలా సంతోషం మావయ్యా! మీరు ఇంత తొందరగా ఒప్పుకొంటారనుకోలేదు. నాన్నకు భయపడి ..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"నాకు తెలుసు సూర్యం పెదనాయుడి పట్టుదల. మీరిద్దరూ సుఖంగా వుండడమే నాక్కావాలి" అన్నాడు.

అప్పుడు రేవతి ధైర్యంగా తల ఎత్తి తండ్రి ముఖంవైపు చూసింది. గోవిందయ్య నవ్వాడు. ఆ నవ్వులో 'నువ్వు తీసుకొన్న నిర్ణయం మంచిదేనమ్మా' అన్న అర్థం వున్నట్టు తోచింది రేవతికి.

"ఇప్పుడు నా మనసెంత తేలికపడిందో చెప్పలేను మావయ్యా ... ఈ పెళ్ళికి ఇంకా ఎన్ని అడ్డంకులో అని భయపడిపోయాను." అన్నాడు సూర్యం.

గోవిందయ్య సూర్యం భుజం తట్టాడు. "రేవతి అదృష్టవంతురాలు సూర్యం" అన్నాడు.

ట్రైన్ స్టేషన్‌లో ఆగుతూ మళ్ళీ బయలుదేరుతూవుంది. ముగ్గురూ ఎవరి ఆలోచనల్లో వారుండడం వల్ల కాస్త మౌనమే రాజ్యం చేసింది. ముగ్గురికీ నిద్ర ముంచుకొస్తోంది.

ఏదో స్టేషన్‌లో మళ్ళీ ఆగింది.

"మావయ్యా నిద్ర వస్తున్నట్టుంది. టీ తీసుకురమ్మంటారా...." అన్నాడు సూర్యం.

"అలాగే...." అన్నాడు గోవిందయ్య నిద్రలో జోగుతూ. సూర్యం లేచి ట్రైన్ దిగి టీ స్టాల్ వైపు నడిచాడు.

* * *

ట్రైను ఒక్క కుదుపుతో ఆగేసరికి గోవిందయ్య, రేవతి ఉలిక్కిపడి లేచారు. గోవిందయ్య వాచీ చూసుకొన్నాడు. టైము అర్థరాత్రి దాటి ఒంటిగంట అవుతోంది.

పక్కన సూర్యం లేడు. ఎవరో తాత కూర్చొని వున్నాడు.

"మా పక్కన కూర్చున్న మనిషి కిందకు దిగాడా తాతా" అన్నాడు గోవిందయ్య.

"నేదే..నాను రైలెక్కిన గంటకాడ్నించీ నీ పక్కన ఎవరూ కూకోనేదే....నానే కదా కూకున్నాను" అన్నాడు తాత.

"కాదు....టీ తాగుతానని...." అని ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.... నిద్రమత్తు వదిలిపోయింది. గోవిందయ్య రేవతి వైపు చూశాడు... రేవతి కళ్ళు భయంతో నిండిపోయాయి.

రెండు నిమిషాలకు ఏం జరిగిందో రేవతికి అర్థమైపోయింది. తండ్రితొడ మీద తలవాల్చింది. కన్నీరు ఉబికి ఉబికివస్తోంది. 'నన్ను క్షమించు నాన్నా' అన్న అర్థం ఆ కన్నీటిలో కనిపించింది గోవిందయ్యకు.

"నన్ను దెబ్బ తియ్యడానికి పెదనాయుడు వేసిన ఎత్తుగని నాకు తెలుసమ్మా. నీకే.... నీకే ఏమీ తెలీదు. నీకు తెలియాలనే ఇదంతా...." గోవిందయ్య కంఠం బొంగురుపోయింది.

రేవతి రెండు కళ్ళు చెరువులైపోయాయి.

"సూర్యం నిన్ను దగా చేశాడని నాకు బాధలేదు తల్లీ. అది నాకు ముందే తెలుసు. కాని....కాని 'నేను సూర్యాన్ని చేసుకుంటాన'ని ఒక్కమాట నాతో చెప్పలేకపోయావు తల్లీ.... అదే.... అదే.... నా బాధంతా" అంటూ పై పంచెతో కళ్ళొత్తుకొన్నాడు. ఒక నిముషం గడిచాక,

"ఇంకెక్కడికి ప్రయాణం! లే-తల్లీ.... ఈ స్టేషన్‌లోనే దిగిపోదాం" అంటూ లేవబోయాడు గోవిందయ్య.

"వద్దు నాన్నా....మనంబెజవాడ వెళ్దాం" అంది రేవతి దృఢ స్వరంతో.

రైలు కూతవేసి బయలుదేరింది.


కొండముది శ్రీరామచంద్రమూర్తి
కలియుగస్త్రీ -రూ.12/-
వసుంధర
తపోభంగం -రూ.12
ఓంకార్
బ్రహ్మచారి బాతాఖాని -రూ.10/-
సింహప్రసాద్
ఊర్వశి -రూ.15/-
మా గత నెల విడుదలలు
వాసిరెడ్డి సీతాదేవి
ధర్మక్షేత్రం -రూ.13/-
లల్లాదేవి
పవిత్రసంధ్య -రూ.15/-
వసుంధర
పెళ్ళయ్యాక చూడు -రూ.14/-
FRIENDS KIRON